# వర్గీకరణీయం

(దళిత దీర్ఘ కావ్యం)



ఎండ్లూరి సుధాకర్

# వర్గీకరణీయం

(దళిత దీర్ఘ కావ్యం)

రచనకాలం 3-12-2004 - 6-12-2004



- ఎండ్లూరి సుధాకర్

ప్రచురణ

**మానస & మనోజ్ఞ ప్రచురణలు**

86-15-4, జి-1, తిలక్‌రోడ్,

రాజమండ్రి - 533 103.

# Vargeekaraneeyam

(A Long Dalit Poem)

By **Yendluri Sudhakar**

Copies : 2000

Price : Rs. 20/- $5

894.827132

C-27074

© Manasa, Manognya

Title with thanks to
Andhra Jyothi & Akbar

First Edition :
**Black Day, December, 2004**

82559

-500 044.

For Copies : All Book Shops,

**Dr. Yendluri Sudhakar,** Associate Professor, P.S. Telugu University,
Rajahmundry Campus, Bommuru - 533 124. E.G. Dist,
Ph : 0883 - 2419322 (O), Mobile : 93979 18502,

**Putla Hemalatha,** 86-15-4, G-1, Sri Leo Towers,
Tilak Road, Rajahmundry - 533 103.
Ph : 0883 - 2445016

Priniting :

**SRI RATNA PRINTERS,**
Prop : K.S.R. Murthy,
Muttangivari Street, Rajahmundry. Ph : 0883 - 2476345

# అంకితం

రాయాల్సిన సమయంలో
రాయకుండానే
రాలిపోయిన
జాతిరత్నాలు
'చండాల చాటింపు' కవి
డా. నాగప్పగారి సుందర్రాజుకూ
గుండెపోటుకి గురైన
'గూటం దెబ్బ' కవి
గ్యార యాదయ్యకూ
మాకు మద్దతునిచ్చి
మధ్యలోనే వెళ్లిపోయిన
సోదర కవి మద్దెల శాంతయ్యకూ
ఎమ్మార్పీయస్ ఉద్యమంలో
అసువులు బాసిన
అమరవీరులకూ .....
పుస్తక ప్రచురణలో
సహాకరించిన
అదృశ్య హస్తాలకూ
ఆత్మీయ నేస్తాలకూ ......

# వర్గీకరణీయం

(దళిత దీర్ఘ కావ్యం)

# A

మహాభారత కథ
మళ్ళీ మొదలయ్యింది
కులాల కురుక్షేత్రం కుంపటి
రంగం మీద రగులుకుంది
కృష్ణ రాయబారం
కొత్త మలుపు తిరిగింది
విదురుడి మాటలు
వినిపించుకోవడం లేదెవ్వరూ
ఐదూళ్లలా
ఎబిసిడిలు అడుగుతుంటే
సూది మొన మోపేంత
చోటుకూడా ఇవ్వనంటున్నాడు
ఇస్సీగాడు
ఎస్సీ సుయోధనుడు
నిండు రిజర్వేషన్ కొలువులో
అవమానాల ఘట్టం
దుఃఖితుల్ని చూడనంటుంది
ధృతరాష్ట్రుడి చట్టం

దేవతల ధర్మాసనంలో
పీడితులకు న్యాయం జరుగుతుందా ?
శకుని మామల సంతానం
పాచికలు వేయక ఉంటుందా ?

ఎన్ని కుట్రలు జరిగినా
ఎందరు సైంధవులడ్డుతగిలినా
వర్గీకరణ విశ్వరూపం
ఎప్పటికైనా అనివార్యం

మహాభారత కథంటే
మాల మాద్గుల కథే !
కౌరవులెవరు ?
పాండవులెవరు ?
ప్రతీకలన్నీ స్పష్టం
ఇది భుక్తికీ
భూమికీ వర్తించే వ్యధే !

అదిగో ! కథ మళ్ళీ
హస్తినకే
అయోధ్యకే చేరింది
పట్టాభిషేకానికి
మంథర అడ్డుపుల్లేసింది

వాలి సుగ్రీవుల గోల
వాడవాడకీ పాకింది

వారీ !
వాలి సుగ్రీవులారా !
రాజకీయ రాముడితో జాగ్రత్త
వాడు చెట్టుచాటునుంచి కాదు
చెప్పుచాటునుంచి బాణమేస్తాడు

విశ్వాస విహీన విభీషణులారా ! పైలం
వాడు మన ప్రాణ రహస్యం
పార్లమెంటులో బహిరంగం చేస్తాడు

ఎ. అంటే ఆకలనీ
బి. అంటే బువ్వనీ
ఇంతమాత్రమే తెలుసుగానీ
సి.డి. ప్లేయర్లు
ఎంత పనిచేశాయి
వర్గీకరణీకంతో
వాటాల గొంతు నొక్కేశాయి

సినిమా సిడిల పైరసీలకే
ఇల్లు పీకి పందిరేస్తుంటే
ఇక్కడ ఎబిసిడిల పైరసీలో
మా జీవితాలే గల్లంతైపోతుంటే
మేమెంత చలించాలి
ఎంత జ్వలించాలి
ఎంతకాలం దోపిడి భరించాలి

రిజర్వేషన్ ఎడారిలో
లోగడ ఒయాసిస్సులం
పొట్టనీళ్లను పోగొట్టుకున్న
ఒంటరి ఒంటెలం
ఇప్పుడిప్పుడే కదా
చిన్న చిన్న చెలమలమవుతున్నాం
చిరునవ్వుల నీటిబుగ్గలమవుతున్నాం
చదువులమ్మ చన్ను కుడుస్తున్నాం

తమ్ముళ్ల వాటాలన్నీ
తన్నుకుపోయారు కదా !
తంగెడు పువ్వులు మీకు
తంగెడు చెక్కలు మాకా ?
కందన గాయలు మీకు
కరక్కాయలు మాకా ?
మంచిమెతుకులు మీకు
మాడన్నాలు మాకా ?
పెద్ద పోస్టులు మీకు
పెంట పోస్టులు మాకా ?
హాయి బూట్లు మీకు
హవాయి చెప్పలు మాకా ?
చెప్పాలంటే చాల ఉన్నాయి
విప్పామంటే గుప్పమంటాయి

ఇంకా ఇంటి గుట్టు
ఇలా బయటేసుకోవడాలా ?
అయితే కానీయ్ !
వీధిలో పడ్డాం
తెగించినోడికి తెడ్డే లింగం

ఈ వర్ణ వ్యవస్థలో
ఎన్నాళ్లకో వచ్చిన సువర్ణావకాశం
ఎవడి బొచ్చెవాడిదే
ఎవరి ముద్ద వాళ్లదే
ఎబిసిడిలంటే ఇదే !

ఇంత చిన్న వివరణ
సర్వసమాన విభజన
ఈ రద్దు బుర్రల కెందుకర్థం కాలేదో
సాధించుకున్నదాన్ని
సగం సగం పంచుకోవడమే వర్గీకరణ

మేకపిల్లలకైనా తెలిసే విషయం
మేధావుల కెందుకు తెలియలేదో
మతలబు తెలిసింది గనకే
పితలాటకం పెడుతున్నారు
విద్వేషాలు చాటుతున్నారు
రాస్తాలు రోకుతున్నారు
పూరంతా టముకేస్తున్నారు

తినేవాడి బుద్ధి
తిండిదగ్గరే బయటపడుతుందని

వాటాల దగ్గరే కదా
వాదులాట పుట్టింది

జరిగిన న్యాయంలో
మీ అన్యాయమెంతో
పొందిన భాగంలో
మాకు ఒరిగిన లాభమెంతో
గణాంక వివరాలన్నీ
గుణాంక పద్ధతిలో
పంచాయితీ పెట్టి
ప్రకటించండి
మా పెద్దలారా !

ఏ సర్వీస్ రిజిస్టర్
తిరగేసినా తెలిసిపోతుంది
ఏ హాజరు పట్టిక చూసినా స్పష్టమవుతుంది

అధిక సంఖ్యలో
ఉద్యోగులెవ్వరో
విద్యార్థులెవ్వరో
లబ్ధిరాజులెవ్వరో
నష్టజాతకులెందరో
కోల్పోయిన హక్కుల

కూటిలెక్కలు కావాలిప్పుడు?
సాంఘిక సంక్షేమాల
సౌకర్యాలన్నీ
ఎవరి పాలయ్యాయి?

మా తలరాతలు మార్చిన
జాబితాలు కావాలిప్పుడు
పాతచెప్పుల్లా విసిరేసిన
జీవితాలు కావాలిప్పుడు

పంచుకున్న వాటాల్లో
వంచనెంత జరిగిందో
పంచనామాల రిపోర్టు
ప్రజలముందు పెట్టాలిప్పుడు
ఏం మాట్లాడుతా'యోచిద్దాం' చట్టాలప్పుడు

తప్పు జరిగిందా
తలవంచుకుంటాం
కుట్ర జరిగిందా
ఎలా ఊరుకుంటాం ?

పొట్ట నిండి 'నోళ్లు'
పోరాటం చెయ్యలేరు
పోరాడే పిడికిళ్లకు
పోటీగా మారుతారు

అన్నలారా !
షరాఫత్‌గా చెబుతున్నాం
మమ్మల్ని అరాఫత్‌లుగా మార్చొద్దు
బతిమాలి అడుగుతున్నాం
మమ్మల్ని పంచాగ్నుల్ని చెయ్యొద్దు

చేతులెత్తి ప్రార్థిస్తున్నాం
మా తలల మీద ముండ్ల కిరీటాలు పెట్టొద్దు
మా ఆకలి మీద మేకులు కొట్టొద్దు
మళ్ళీ మనువులుగా మారి
మా మెడకు ముంతలు కట్టొద్దు
ఆత్మగౌరవ పోరాటాల మీద
అవమానాల బురద చల్లొద్దు

మామనాడు అధ్యక్ష మహోర్చకా !
రాజమండ్రిలో
మూర్తీభవించిన నిలువెత్తు ఆత్మగౌరవానికి
దండ వేసి
దండంపెట్టి
దండోరా సభ పెట్టినందుకే కదా !
కృష్ణ స్పర్శ సోకిందని
అంబేద్కర్ విగ్రహం అపవిత్రమైందనీ

మొహమంతా అంటు గంట్లు పెట్టుకుని
మొన్న డిసెంబరారు ఉదయాన

క్షీరాభిషేకం చేయించారు
అచ్చం మనువు కోరల
మాబ్రాలా ప్రవర్తించారు
ఇది హిందూ కోబ్రాల సంస్కృతి కాదా ?

చేతనైతే
స్వామి మెడలో
చెప్పుల దండలు పడకుండా
పూజారిలా కాపలా కాయండి
జాతిగౌరవం నిలబెట్టండి
అదిగో
గోరక్షణపేట పాకల్లోంచి
ఆకలితో ఏడుస్తున్న
అస్పృశ్య శిశువుల పాలకేకలు వినండి

# B

మా కెవరు నేర్పారు
పోరాట పాఠాలు

దండోరా ఒకదారి చూపితేనే కదా
పదండర్రా అంటూ
ఒక నినాదమయ్యింది
ఒక ఉద్యమంగా నిలబడింది
క్రొడవళ్లూ తుపాకులే కాదు

చెప్పులూ డప్పులూ కూడా
విప్లవాలు తెస్తాయని నిరూపించింది
రాజ్యలక్ష్మి కళ్లు తెరిపించింది
హక్కులతోనే కదా
నాలుగు బుక్కలు సంపాదించుకుంది
సాధించుకుంది

ఈ మట్టి మీద
మట్టా మర్యాదగా బతికామేగాని
పొట్టకు మించి కోరిందెప్పుడు ?

చిల్లుల గొడుగు కింద
తలవొంచుకొని
చెప్పులు కుట్టడమే గానీ
తలెత్తి మాట్లాడిందెప్పుడు ?

ఆసాముల దగ్గర
ముద్ద పెట్టించుకోవడమే గాని
వాటా కోరిందెప్పుడు ?

కూలీ డబ్బులు
నేలమీదే అందుకున్నాం గానీ
వేలెత్తి అడిగిందెప్పుడు ?

కులవృత్తులు కోల్పోతున్నా
కడుపులు కాలిపోతున్నా

ఆత్మహత్యలు చేసుకోలేదు
ఆత్మగౌరవాలు అమ్ముకోలేదు

పాకీపనులు చేశాం
పాచిపనులు చేశాం
సఫాయీలమయ్యాం
సిఫాయీలమయ్యాం
చచ్చరోల్ల మయ్యాం
చప్రాసీలమయ్యాం
డక్కలోల్లమయ్యాం
డొక్కలు మాడ్చుకున్నాం
బుడిగె జంగాలమయ్యాం
బతుకు భంగాలమయ్యాం
బేగరోల్లమయ్యామే గాని
బేకారుగా మాత్రం లేము.

హక్కులు అడిగిందెప్పుడు ?
అక్షరాలుగా మారిందెప్పుడు ?

న్యాయం లేదా మానాదంలో
చండాల గొంతుల నినాదంలో
మాకు ముసుగులు తెలియవు
లిటిగేషన్ చట్టాల లొసుగులు తెలియవు

పిలిపించండి
ఆకాశం నుంచి ఆ త్రిమూర్తుల్ని

రప్పించండి
సుప్రీమ్ న్యాయమూర్తుల్ని
జాంబపురాణం విప్పుతాం
జవాబు చెప్పమనండి.

జగతికంటే ముందు పుట్టిన
తాత జాంబవంతుడు
కామధేనువుని కోసి
కుప్పలు పోసి
మనవడా కాపలా ఉండమని స్నానానికెళ్తే
వచ్చి చూసేసరికి
వండిన మాంసం మాయం
మెత్తని చియ్యలు మీకు
ఎముకల పోగులు మాకు మిగిలాయి
పంపకాలల్లో
చెన్నకేశవుడు చేసిన ఆదిమ మోసం
చెప్పకుంటే తీరుతుందా ?
న్యాయదేవత నమ్ముతుందా?
పోనీలే ముక్కల పురాణమనుకుందాం !
మరి హక్కుల తక్కెడ మాట ఏమిటి ?
మా వాటా మాకు రాదేమిటి ?
అన్నల్లారా !
మా గిన్నెల్లో
మన్ను బోశారు కదా !

అరుంధతీ సుతుల కళ్లల్లో
కన్నీటి కాటుక రేఖలు
రెప్పలకింద చెప్పుల మేకులు
గూడేలన్నీ
గుప్పిట్లో ప్రాణాలు పెట్టుకున్నాయి
ఉద్యోగాలు ఏమవుతాయోనని
ఉద్వేగాలు పెరిగిపోతున్నాయి
ఎవరిని కదిలించినా
దిగులు మబ్బుల జల్లులు
ప్రతి ఇల్లూ ఒక ఎమర్జన్సీలా ఉంది
చదువుకున్న గుడిసెల్లోకూడా
వర్గీకరణరద్దు త్రాచులా దూరింది
భయం ! భయం !!
వచ్చిన పోస్టు పోతుందేమోనని
వండిన అన్నం వైపు చూపు పోవడం లేదు
కన్నీళ్లు మింగి మింగి
కడుపు నిండిపోయింది
మట్టిగోడల క్యాలండర్ల మీద
ఎబిసిడిలు కనబడితే
ఏడుపొస్తోంది
ఇచ్చిన సీటు
ఇట్టే వెనక్కి పోతుందేమోనని
వెక్కి వెక్కి పుస్తకం

తడిసి ముద్దయి పోయింది
ఈ బాధ ఎబిసిడిల్లో ఎవ్వరికీ రావద్దు
బహుశా ఈ కోత ఎవరికీ అర్థం కాదు

మాకు మెరిట్ లేదన్న వాళ్లని
మెట్టుతో కొట్టాలనిపిస్తుంది
మాకు ప్రతిభలేదనే నోళ్లని
పట్టిడపెట్టి కుట్టాలనిపిస్తుంది

మా వృత్తి విదేశాలకు చేరుంటే
మా కత్తి ఖండాంతరాలు దాటుంటే
మా ఉత్పత్తులకు
పేటెంట్ హక్కులే వచ్చుంటే
మా పాదుకలకి
ప్రపంచ పట్టాభిషేకం జరిగుండేది
చిలుకలుగా హంసలుగా
చిత్రచిత్ర వర్ణాలతో
ఒక ప్రాచీన చర్మకళా సౌందర్యంతో
మా మఖ్మలు తోళ్ల బంగారు పూలచెప్పలు
రెండు తులాల బరువు తూగేవి
ఆ చెప్పలు తొడిగిన ప్రతివాళ్లు
మొక్కాల్సింది దేవుళ్లకు కాదు
మా కాళ్లకు.
'చెప్ప'కుంటే చాలా ఉంది

పాదుషాలూ ప్రభువులూ
మా కెంపుల కుచ్చుటుద్దాలకూ
మా ముత్యాల ముచ్చెలకూ
మా కిర్రు చెప్పుల లయ సోయగాలకూ
ముగ్ధులైపోయి
ముద్దుపెట్టుకునేవాళ్లు
ఇవి మట్టికాళ్లకు కాదు
నెత్తిన పెట్టుకోవాలని మెచ్చుకునేవాళ్ళు
మా పనితనం పతనమైపోయిందిగానీ
బాటాలను మించి
బలాదూరుగా బతికేవాళ్లం
కరోనా కంపెనీలని దాటి
కరోడ్ పతులమయ్యేవాళ్లం
ఈ చదువులన్నీ చంకనచుట్టి
మెరిట్‌గాళ్ల మొఖానకొట్టి
మెర్సిడిజ్ బెంజ్ కారుల్లో
పలక వాయించుకుంటూ కులికేవాళ్లం
వెంకన్నకి
వెండి చెప్పేం ఖర్మ ?
వజ్రాల చడావులు.
నజ్రానాగా చదివించేవాళ్లం
చరిత్రగూడలు తెరచి చూడండి
సమ్రాట్ వీరబాహుడి నుంచీ

బుద్ధుడికాలం నాటి
విద్ధకుడిదాకా
ఒక పద్ధతిగా బతికినోళ్లమే !
భోగభాగ్యాలతో తులతూగినోళ్లమే !
శూద్రకుడి 'మృచ్ఛకటికం' చదివి చూడండి
చర్మకారుడి పొగరు తెలుస్తుంది
మేము బతికి చెడినవాళ్లమే గాని
చెరిపి బతికినోళ్లం కాము.

C

"మాదిగలకి మేము తప్ప
మరో గత్యంతరం లేదని"
'ఎన్నటికైనా మేమే దిక్కని'
'మా కాళ్లదగ్గరికి రావాలని'
తరచూ పత్రికల్లో ప్రజల్లో
ఎద్దేవా చేస్తున్న
రద్దుల రావు బహద్దూరు గారూ !
ఎంతమాట సెలవిచ్చారు సారూ !
ఆయ్ !
అంతమాట మేమనగలమా !
మీ ముందు మనగలమా ?
మీ వాడే అన్నట్లు
'రిజర్వేషన్ గాళ్లకి పౌరుషాలు కూడానా'

దేశ విభజనలో
ఇండియా పాకిస్తాన్‌లాగా
కుల విభజనలో
ఇద్దరం నష్టపోయామని
మీరెందుకనరు?
మాల్‌థాకరేలా ! మాట్లాడితే ఎలా ?
మామాధిపతీ !
మహాకవి జాషువా
చీదరించుకొని
ఏనాడో అన్నాడు
ఈ రెండుజాతుల్ని కలపడం
ఏ దేవుడి తరమూ కాదని.

రావుకి బహువచనం
రావులపాలెమా ?
అన్నదమ్ముల రెచ్చగొట్టే
ఊరేగింపుల మేళమా !
జింకల మీద వంకల చూపి
సింహాలు గర్జిస్తూ
'న్యాయగర్జన' అనడంలో
న్యాయముందా?
దళితుల ఐక్యత వర్ధిల్లాలని
దద్దరిల్లే కేకల్తో
దబాయిస్తున్నారు గానీ

సుందరయ్య గ్రంథాలయ సంఘ
82559
హైదరాబాద్-500 044.

దయగా చెబితే
మాకర్థం కాదా !
వర్గీకరణకి చట్టబద్ధత
ఎబిసిడిల ఆర్థిక భద్రత
అరమరికలు లేని ఐక్యత
ఇదే కదా మేము కోరేది
మా యన్నలారా !
మమ్మల్ని యోసేపుల్ని చేశారు గదా
కాసేపైనా మా ఎదుగుదల చూసి
ఓర్వలేకపోయారు కదా !
మూడు తరాలు ముందున్నారు
అన్ని వరాలూ అందుకున్నారు
మంచి మాల్దీవులలో ఉన్నారు గనకే
మాల్కోస్ రాగాలు పాడుతున్నారు.
బుద్ధావతారులం
మా లందల్లోంచి
నిద్ర లేచేసరికి
జరగాల్సిదంతా
జరిగిపోయింది
మందభాగ్యులం
ఒక మందగా మారడానికి
చెప్పుల వార్ చేయాల్సి వచ్చింది.
మోదుగ పువ్వుల్లాంటి

మాదిగ తల్లులు
మట్టిలో మాణిక్యాలే ఐనా
వెట్టిలోనే మగ్గిపోయారు
పల్లెల్లో ఎల్లమ్మలుగా మిగిలిపోయారు
నల్లపోచమ్మలుగా నలిగిపోయారు
భోగినీ వ్యవస్థలో
జోగినీలుగా చితికిపోయారు
దేవుడి పెళ్లాలుగా మాతంగ కన్యలుగా
నెత్తురు కొరికిన
పచ్చి పసుపుకొమ్ములయ్యారు
ఏ లూథరన్ హైస్కూల్లోనో
మేమూ చదివుంటే
మా చేతుల్లోకి బైబుల్లే వచ్చుంటే
ఎలిజబేతులుగా ! మార్తలుగా
ఎస్తేరులుగా విస్తరించి ఉండేవాళ్లం
నరుసులుగా ! పంతులమ్మలుగా
నాజూకుగా పెరిగుండేవాళ్లం.

తెలంగాణాలో
తెల్లవారిందెప్పుడు ?
అర్ధశతాబ్దం దాటాకే కదా
అంబేద్కర్ సూర్యుణ్ణి చూసింది
జగజ్జీవన చంద్రుణ్ణి దర్శించింది

అంబేద్కర్ విగ్రహాలు
మా వీధుల్లో నిలిపి ఉంటే

అంబేద్కర్ భవనాలు
మా పల్లెల్లోనూ కట్టి ఉంటే
ఇంత రచ్చ జరిగేదా ?
ఇంత ఎడం పెరిగేదా ?

నిజమే !
రిజర్వేషన్ బడిలో
లేట్ కమ్మర్స్‌మి
మా మొహాలకి ఫెయిల్ మార్కులు గాక
ఫస్టు మార్కులొస్తాయా ?
సవర్ణవేత్తల్లాగా
మీరు కూడా మెరిట్ మంత్రాలు వల్లిస్తే
అంబేద్కరాత్మ శాంతిస్తుందా ?
బాబా సాహెబుకీ
బౌద్ధానికీ
పేటల్లో బాటవేసిన
పావనమూర్తులు కదా
మా జీవనస్ఫూర్తులు కదా
బోధించండన్నారు
పోరాడమన్నారు
సమీకరించండన్నారు

మీరు నేర్పిన విద్యలే కదా
మేమూ కొంత నేర్చుకుంది

మీరు కూడా
మెరిటు మెటికలిరిస్తే
మేమేం కావాలి ?

ఏ ధర్మవ్యాధుడు
మా చర్మకారుల గోడు వింటాడు ?
ఏ దళిత క్రీస్తు
మాకు దోస్తుగా మారుతాడు ?
ఏ మూల వాసి
మమ్మల్ని చూసి
మోషేలా ముందుకు నడిపిస్తాడు ?
ఏ కన్నమనీడు
మాకోసం పోరుచేస్తాడు?
ఏ రాజరాజు
మా కర్ధరాజ్యం రాసిస్తాడు.

సానుభూతి పరులారా
స్వాగతం
రంతిదేవుల్లారా
రండి మాకోసం
దళితో రక్షతి రక్షితః

తరతరాలనాటి
తగవులు మరచిపోదాం

కొత్త తరాల కోసం
కొంత ఆలోచిద్దాం
ఆంబోతుల కుమ్ములాటలో
నలిగిపోయే లేగల్ని రక్షించుకుందాం !

అందరి ముందర
సుందోపసుందులం కావద్దు
కయ్యాను ఏబేల్లా
ఖతం చేసుకోవద్దు

నాలుగు కళ్లూ
మనల్నే చూస్తున్నాయి
నాలుగ్గోడలూ
మన మాటలు వింటున్నాయి

మన సిగపట్లు
పై వాళ్లకు చూడముచ్చట్లు
నడిరోడ్లపై మన తిట్లు
పెద్దవాళ్లకు నేతి పెసరట్లు

మనమేమైనా
అంబారీలెక్కి
అంబానీలమా
అన్నదమ్ముల తగాదాలు
రంగుల మీడియా ముందు
రంజుగా ఉండేందుకు

వర్గీకరణ బిల్లు
రద్దయిన రోజున
పెద్దాయన విగ్రహానికి
పాల అభిషేకం చేయలేదా
గూడేలన్నీ కుతకుతలాడుతుంటే
పేటలన్నీ పండుగ చేసుకోలేదా?
మా ముందే
కళ్ల కరచాలనం చేసుకోలేదా

ఎవరు కాదన్నారు
మీరు పైకొస్తుంటే
పలావులు తింటుంటే
ఎంత సంతోషం
మిమ్మల్ని చూస్తుంటే

ఎబిసిడిలు కాగానే
ఎందుకింత మండిపడుతున్నారు
బి గాళ్లని చూస్తేనే
బెంబేలెత్తిపోతున్నారు
పల్లెనుంచి పార్లమెంటు దాకా
ఫైళ్లు నడిపిస్తున్నారు

ఎబిసిడిల దీపాల్ని
ఆర్పకండి చీకటి చేతులారా !
మిణుగురు పురుగుల వెలుతుర్లో

పావురాల గొంతు పిసక్కండి
రద్దుల కోతులారా !

ముద్దలకోసం జరుగుతున్న
గద్దల యుద్ధమిది
మూడో వర్ణం సంధి చేయడం
పెద్ద అబద్ధమది
నాలుగు ముద్దల్ని
న్యాయంగా పంచుకోలేని మనం
ముందు ముందు
ముఖ్యమైన గద్దెల్ని
ఎలా చేజిక్కించుకోగలం ?

పాలక యంత్రాలు
తుపాకుల మాటలే వింటాయి
చర్చల చదరంగానికి
ఆహ్వానాలు పంపుతాయి
మనల్ని మాత్రం
అసింట అంటూ
అసహ్యించుకుంటాయి
బహుశా
మన చావు మనమే చావాలి
పాముా ముంగీసల్లా బలి కావాలి

మన దగ్గరేమున్నాయి తొండాలు
ముద్దల కోసం మోసే అద్దెల జండాలు

మనం పునాదుల్ని కదిలించకపోతే
పోరాట సౌధాన్ని నిర్మించలేం !
మనం కోటలో పాగా వెయ్యకపోతే
కిరీటాలు సాధించలేం !
వదిలించుకోవాలి
మనలోని జాడ్యాన్ని
కూలగొట్టాలి
కుల కుడ్యాన్ని

కూటాల్లో క్రైస్తవులం
వాటాల్లో హిందువులం
సగమేమో మెరిట్
మిగతాది హోలీ స్పిరిట్

పొరుగువాణ్ణి ప్రేమించలేం
సోదరభావం చూపించలేం
దళిత హంసల మీదనా
కక్షలు కట్టడం
చెప్పుల మీదనా
నిప్పులు పోయడం

మా దప్పికకు
మీరు చిందెయ్యాలి

మా హక్కుకు
చెయ్యందివ్వాలి

తగ్గిద్దాం మన దూరాన్ని
చెరిపేద్దాం మన వైరాన్ని
ఏమైపోవాలి
మన రక్తసంబంధాలూ
మన స్నేహ సుగంధాలూ

పేటకీ గూడేనికీ
పేగు ముడేద్దాం !
మోదుగ పూలతో కట్టిన
ప్రేమ మాలలు ధరిద్దాం !

# D

మాట్లాడండి
మాలో యిష్టులారా
దళిత దయా దృష్టులారా
అంబేద్కరిస్టులారా
జర్నలిస్టులారా

మానవ హక్కులు
మాదిగ హక్కులు
ఒక్కటీ కాదా

బతుకు హక్కులు
మెతుకు హక్కులు
దళిత హక్కులు కాదా

హక్కుల ధర్మకాటా ముందు
ఆకలి తలవంచడం
అంబేద్కరిజం కాదా
మా ఆక్రోశంలో నిజం లేదా ?

మాట్లాడు మాలతీ !
నీ జవాబు కోసం
ఎదురు చూస్తోంది
మా అరుంధతి

మాట్లాడండి
మహానుభావులారా
మహాకవులారా
మౌన సభాసదులారా
అలికిడిలేని గదులారా

కె.జి సత్యమూర్తీ
మాజీ నిత్యస్ఫూర్తీ
అపార కృపా భావుకా
విప్లవాల నావికా
'మండుతుంది మాదిగడప్పు'
మాట్లాడాలి నీవిక

అన్నల మీదైతే
కన్నులెర్రజేస్తావు
సైద్ధాంతిక ప్రశ్నలతో
సైరా అనిపిస్తావు

తమ్ముల దగ్గర మాత్రం
నిమ్మకు నీరెత్తుతావు

శివసాగరమెందుకు
అలల కదలి విడిచింది
'నడుస్తున్న చరిత్రెందుకు'
నాలుక తిప్పకుంది.

భీష్మన్నా !
నీ మౌనమే
మాలాంగీకారమా ?

నిజంగా !
వైతాళికులంటే వాళ్లే
కుసుమ ధర్మన్నలు
బోయి భీమన్నలు
ప్రాతఃస్మరణీయులు
మా గురించి కూడా కొంత రాసారు
మా బాగు కోసం సుంత ఆలోచించారు

గద్దరన్నా
నీకిద్దరన్నా
ఒక్కటే నంటావు

చెప్పు
నువ్వైనా చెప్పు
అడుగుతున్నది
అణగారిన చెప్పు
విప్పు
గజ్జెల గొంతు విప్పు
తిప్పు
నీ ఎర్రచేతి రుమాల తిప్పు
నీ పాట మీద ఒట్టు
ఈ దళిత పులులకు
ఒక దారి చూపెట్టు
ఏదైనా చర్చ చేపట్టు

అంటరాని ఆ'కుల' సొద
వసంతానికి పట్టదా
చీమలు కూడా గర్జిస్తాయని
పుట్ట ప్రతినిధికి తెలియదా
దళిత కళ్యాణంలో
మామిడాకులకు చోటులేదా
మేమున్నామనే మాటరాదా

ఒంగోలు దళిత గిత్తలారా
చురుకైన చురకత్తులారా
ఎత్తుకు పై ఎత్తులారా
ఉద్య మాల వీరులారా

ఒక్క మాట కూడా
మాట్లాడకుండా
ఎంత గుట్టుగా
నిరసనోద్యమాలు నడుపుతున్నారు !
అంబేద్కర్ ఆత్మఘోష
వినిపించడం లేదా ?
కర్మభూమిలో పూలే భాష
కంటికి కనిపించడం లేదా
మా బాధలో నిజం
అనిపిస్తే కలపండి భుజం

దళిత జాతుల
ధర్మయుద్ధకారుడా
అమలాపురం అంబేద్కరా
అన్నా సవేరా
నువ్వూ ఆ వరస వేరా
నీవు వేరా
నేను వేరా
బోధివృక్షం కింద
మనల్ని కలిపే
మహాత్ములే లేరా ?

మాట్లాడండి
మహానాయకులారా

పద్మవ్యూహకులారా !
ఉద్యమ సూర్యుళ్లు కదా
ఉద్ధృతి పరవళ్లు కదా
గొంతు ఒరలోంచి
మాటల 'కత్తి'
బయటికి రాదేం ?
గాలి నిప్పులు కురవదేం ?
నల్ల కలువా !
మాకిదా విలువా ?

న్యాయ కోవిదా !
'నది పుట్టిన గొంతుకా'
నీలాల తారకా
ఉండకయ్యా ఊరకా

'పంచమ వేదమా'
ప్రతిభా కవి పాదమా
మరీ ఇంత భేదమా ?
గమ్మునుండకు
గౌరీ ప్రియనాదమా !

మాట్లాడండి
'మంచి' కవులారా !
మౌనమెందు 'కోయి' ?
నువ్వైనా మాట్లాడవూ
'కొత్త చెప్పుల' కవీ
కోకో రావూ !

అగ్రవర్ణాల మీద
ఉగ్రవాదుల్లా
విరుచుకు పడ్డారు కదా
'డాష్‌లో తంతామని'
రాష్‌గా రాసారు గదా
మా దగ్గరెందుకు
ముడుచుక పోయారు
మాటలు కరుపై
మట్టి కరుచుకపోయారు
తోలు తిత్తులయ్యారు
కొయ్య కత్తులయ్యారు

ఇదేమి న్యాయం ?
ఇదేమి ధర్మం ?
నంగి నంగి గానైనా
సంఘీభావం ప్రకటించే
సహదేవుడొక్కడైనా
సాహిత్యంలో లేడా ?
మాట్లాడవేం మద్దూరి
మద్దతడుగుతున్నాడు నీ ఎండ్లూరి
దళిత కవిత్వంలో
దళ నాయకుడివి కదా
'పెలివాడ'ల పెతలు తెలిసిన
జ్వలితాక్షరాల వేడివి కదా !
మా వాడివి కదా !
ఏమయ్యావు పైడీ

మీడియా మింగేసిందా ?
'అల్పపీడనం'లో
నిన్ను పలికించే
హిందూ సముద్రుడేడి ?
గొప్ప గౌరవాలందుకున్న
కవి కౌరవులారా మాట్లాడండి.
'మువ్వల చేతికర్రలు'
మూలన పడ్డాయా ?
కొయ్య కాళ్లను చూసి
అయ్యో అంటారు
పూల కుర్రాళ్ల మీద
కన్నీళ్లు చల్లుతారు
'కిర్రు చెప్పుల భాష' వింటూ
కిక్కుర్రు మనకుండా ఉంటారు
మాట్లాడండి
కవిరాజశిఖామణులారా
కొంగ కనుల మహామునులారా

మాట్లాడని కవుల గురించి
చరిత్రకూడా మాట్లాడదు
మాట్లాడే గొంతుముందు
మకార మమకారాలుండవు

మామనాడు
భయపెడతాడా ?
బహిష్కరిస్తాడా ?

ఇక దళిత సాహిత్యంలో
అవర్ణాలు లేవు
అన్నీ సవర్ణాలే
అందరికీ సవాళ్లే
పల్లె కన్నీరు పెడితే
తల్లడిల్లే కన్నులారా
మా గోసంగి గోడుకి
గొంతులివ్వండి
కనబడే కుట్రల
గోస వినండి
గోరటింకన్నలార

మాట్లాడండి సోదరులారా !
మాకంటే ముందు
మాటనేర్చారుకదా !
మాటకి మాట మాట్లాడ్డం
మాకంటే బాగా తెలుసు కదా !
ధర్మశాస్త్రాలు వల్లించడానికి
ధర్మరాజులం కాము
న్యాయపీఠాల్ని నిలదీసేందుకు
న్యాయకోవిదులం కాము
మాకోసం
ముందుకొచ్చేవాళ్లెవరు ?
బందు పాటించేవాళ్లెవరు ?
విందులో కూర్చున్నవాళ్లకు

మందమథనం తెలుస్తుందా !
ఐదు రొట్టిలూ
రెండు చేపలూ
ఆశీర్వదించి పంచే
ఏసుల కోసం
ఎదురు చూస్తున్నాం

మా కళ్లు కప్పి
రొట్టిలు దొంగిలించే
దోషుల్ని
ద్రోహులుగా ప్రకటిస్తున్నాం

మాది గూడా
తమ బాధగా అనుభవించే
వికర్ణుల్ని
వేనోళ్లతో ఆహ్వానిస్తున్నాం !

రద్దుల వర్గీకరణ
సోదరులకు స్వర్గీకరణ
మాకు మాత్రం
దురదృష్టీకరణ

వర్గీకరణ వ్యాకరణంలో
కొత్తసంధి కుదరాలి
వైరి సమాసం లేని
ఏకవాక్యం రాయాలి

ఉమ్మడి పోరాటాలకు
ఇదే వేదిక
ఇంతకు మించిన ఐక్యత
ఉద్యమాల్లో రాదిక

రామాయణ కథే కావచ్చు
రామలక్ష్మణుల్లా ఉందాం
నాలుగు గ్రూపులం కలసి
భరత శత్రుఘ్నుల్లా బలోపేతమవుదాం
ఎబిసిడి లిస్టుల్లా ఒక్కటవుదాం

వాల్మీకి రాసినా
వరవరరావు చెప్పినా
వాస్తవ మిదే !

మహాభారతకథ
యుద్ధంతో అంతమయ్యింది
మా మా మహాభారతం మాత్రం
సంధితో సమాప్తమవుతుంది
సమసమాజ శాంతిని స్వాగతిస్తుంది.



★★ + ★★★

మహాకావ్యానికి క్రైటీరియా
సైజూ బరువూ కాదయా
నిన్నటి మహాకావ్యం పద్దెనిమిది పర్వాలైతే
నేటి మహాకావ్యం పద్దెనిమిది పేజీలే !
- శ్రీశ్రీ

## కవి పరిచయం

| | | |
|---|---|---|
| పేరు | : | ఎండ్లూరి సుధాకర్ |
| పుట్టినతేది | : | 21-1-1959, నిజామాబాద్, పాముల బస్తీ |
| తండ్రి | : | ఎండ్లూరి దేవయ్య, ప్రకాశం జిల్లా, కనిగిరి తాలూకా, రావికుంటపల్లె. |
| తల్లి | : | శాంతాబాయి |
| విద్య | : | వీధి బడినుంచి విశ్వవిద్యాలయం దాకా.<br>ఓరియంటల్ విద్య, నల్లకుంట ప్రాచ్యకళాశాల, హైదరాబాదు.<br>ఎం.ఎ., ఎం.ఫిల్, ఉస్మానియా యూనివర్శిటీ.<br>పిహెచ్.డి; జాషువా సాహిత్యం-దృక్పథం-పరిణామం-పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం |
| వృత్తి | : | జీవిక కోసం రకరకాల వృత్తులు చేశాక, 1985 నుండి 1990 వరకు తెలుగు పండిట్, వెస్లీబోయ్స్ హైస్కూల్, సికింద్రాబాద్.<br>1990 అక్టోబరు 6 నుండి ప్రస్తుతం వరకు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, సాహిత్యపీఠం, రాజమండ్రి ప్రాంగణంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గానూ, (ఆధునిక సాహిత్య శాఖాధిపతిగా 1994-2004 వరకు) ఉద్యోగం చేస్తున్నారు. తెలుగు విశ్వవిద్యాలయం త్రైమాసిక పత్రిక 'వాఙ్మయి'కి ఎడిటర్‌గా వ్యవహరిస్తున్నారు. |
| రచనలు | 1. | వర్తమానం (కవితా సంపుటి), |
| | 2. | జాషువా 'నా కథ' (ఎం.ఫిల్ పరిశోధన), |
| | 3. | జాషువా సాహిత్యం - దృక్పథం - పరిణామం (పిహెచ్.డి; అముద్రిత సిద్ధాంత గ్రంథం), |
| | 4. | కొత్త గబ్బిలం (దీర్ఘకావ్యం), |
| | 5. | మల్లెమొగ్గల గొడుగు (మాదిగల ఆత్మకథలు), |
| | 6. | నా పుస్తకమే నా ఆయుధం (డా శరణ్‌కుమార్ లింబాలే మరాఠీ దళిత ఆత్మకథకు తెలుగు అనువాదం), |
| | 7. | నల్లద్రాక్ష పందిరి - దార్కీ (ఉభయభాషా కవిత్వం)<br>a bil ngua anthology of poems |
| | 8. | వర్గీకరణీయం (దళిత దీర్ఘకావ్యం) - 2004. |

ప్రచురణలు, ప్రసారాలు : జాతీయ అంతర్జాతీయ పత్రికలలో ప్రచురణ రేడియో, దూరదర్శన్, ఇంటర్‌నెట్‌లలో కథలు, కవితలు, రచనలు ప్రసారం.

పురస్కారాలు : దాదాపు 25కు పైగా అవార్డులు. అందులో ప్రధానమైనవి.

1. లలిత కళాపరిషత్తు, పురస్కారం, నల్గొండ - 1980
2. ఫ్రీవర్స్ ఫ్రంట్, హైదరాబాద్ - 1992
3. ఉదయభారతి నేషనల్ అవార్డు, భువనేశ్వర్ - 1993
4. కవికోకిల జాషువా పురస్కారం, విజయవాడ
5. తిలక్ అవార్డు, బెంగుళూరు
6. గరికిపాటి సాహిత్యపురస్కారం, కాకినాడ
7. సమతా రచయితల పురస్కారం (సరసం), అమలాపురం
8. రాజమండ్రి ప్రతిభా పురస్కారం
9. జేసిస్ అవార్డు, రాజమండ్రి
10. మ్యాన్ ఆఫ్ ది ఇయర్ 1994-95, రాజమండ్రి
11. తెలుగు విశ్వవిద్యాలయం పురస్కారం, హైదరాబాద్
12. బి.యస్. రాములు కథా పురస్కారం, జగిత్యాల
13. ఎన్.జి. రంగా శతజయంతి పురస్కారం, హైదరాబాద్
14. డెట్రాయిట్ తెలుగుసంఘం రజతోత్సవ పురస్కారం, యు.ఎస్.ఎ.
15. అమెరికా తెలుగుసంఘం (ఆటా) 2002 సత్కారం, డల్లాస్, అమెరికా.
16. సహృదయ సాహితీ పురస్కారం, వరంగల్, 2004.

అనువాదాలు : దాదాపు అన్ని భారతీయ భాషల్లోనూ ఇంగ్లీష్, ఫ్రెంచి, జర్మనీభాషల్లోనూ వీరి రచనలు అనువదించబడ్డాయి.

అముద్రితాలు : జాషువా 'గబ్బిలం' - 'అగ్గిమీద గుగ్గిలం' (విమర్శగ్రంథం) 'అటా'జనికాంచె, అమెరికా యాత్రా కవితలు, 2002

ఉర్దూ అనువాదాలు : 'నజరానా' పేరుతో విఖ్యాత ఉర్దూ కవుల కవితలకు తెలుగు తర్జుమాలు

బిరుదులు

1 కవిరత్న (కర్నూలు)

2. నవయువ వచనకవితాచక్రవర్తి (జాషువా శతజయంతి సాహిత్య సంఘం, వినుకొండ)

'యంగ్ నేషనల్ పొయెట్' 23 మంది భారతీయ భాషా కవుల్లో తెలుగు కవిగా (1993 ఒరిస్సా).

82559

# Vargeekaraneeyam

(A long Dalit Poem)



## ఉభయకుశలోపరి

ఒక ఉద్యమంలో సభ్యుడై, ఆనక గాయపడిన సైనికుడై - ముద్ద ఎక్కక నిద్ర పట్టక ఒక కవి - ఆర్తితో ఆవేదనతో ఆవేశంతో రాసిన కావ్యం చేతికి వస్తే, వట్టినే కవిత్వమూల్యవివేచన చెయ్యడం సబబు కాదనుకుంటాను. అలాగని కవితాంశలను తడమకుండా ఊరుకున్నా కావ్యాన్ని కించపరచడమే.

ఇందులో ప్రతీకలున్నాయి. వ్యంగ్యాలున్నాయి. ఎత్తిపొడుపులున్నాయి. ఎద్దేవాలున్నాయి. పదయోజనలో పదాంతరీకరణలున్నాయి. అర్థాంతర స్ఫురణలున్నాయి. అంతటా కంటితడీ గుండె అలజడీ ఉన్నాయి. ఇంకా కొన్ని అగ్గిపుల్లలున్నాయి. సబ్బుబిళ్లలూ ఉన్నాయి.

మా మా మహాభారతం సంధితో ముగియాలని మా సుధాకర్ ఆకాంక్ష, పదిహేనేళ్లుగా చూస్తున్నాను. ఇతడిది ఇదే ఆకాంక్ష, ఇదే ఆలోచన, ఇదే ఆచరణ. అనేకతవల్ల నష్టపోయిన ఒక వర్గం బాధితుడిగా నేను సుధాకర్‌ని సరిగ్గానే అర్థం చేసుకున్నాను. ఎక్కడైనా ఎప్పుడైనా సమేకత రావాలంటే సమైకత తప్పనిసరి.

ఇందులో ప్రస్తావనకు వచ్చిన కవులూ ఉద్యమరవులూ మేధావులూ స్పందిస్తారని ఆశిస్తాను...

10-12-2004 - బేతవోలు రామబ్రహ్మం